విశాలాంధ్ర కృష్ణా జిల్లా

తాగునీటి సమస్య లేకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలి

విశాలాంధ్ర బ్యూరో, మచిలీపట్నం: జిల్లాలో వేసవిలో తాగునీటి సమస్య ఏర్పడకుండా వేసవి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లో స్పందన మీటింగ్ హాల్లో ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, వ్యవసాయ, విద్యుత్, ఇరిగేషన్, పశుసంవర్ధక, సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 266 తాగునీటి చెరువులు ఉన్నాయని, తీర ప్రాంతంలోని కృత్తివెన్ను, బంటుమిల్లి ,పెడన, నాగాయలంక కోడూరు మండలాల్లో తాగునీటికి సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించిన హ్యాబిటేషన్స్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇరిగేషన్ ఉన్నతాధికారులతో మాట్లాడామని, ఏప్రిల్ మొదటి వారంలో కాలువలకు నీరు వదులుతారని, తాగునీటి చెరువులన్నీ నింపుటకు చర్యలు తీసుకోవాలన్నారు. కాలువల ద్వారా నీరు వదిలినప్పుడు కాలువ శివారు ప్రాంతాలకు చేరేలా ప్రాధాన్యతనిస్తూ తగిన నీటి ప్రవాహ సామర్థ్యంతో నీరు విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ కె చంద్రశేఖర రావు, జిల్లా ఆర్డబ్ల్యూఎస్ అధికారి టి శివప్రసాద్, డిపిఓ నాగేశ్వర నాయక్, డ్వామా పి డి జీవి సూర్యనారాయణ, జడ్పీ సీఈవో ఇన్చార్జ్ ఆనంద్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎన్. పద్మావతి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాసరావు, మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు మున్సిపల్ కమిషనర్లు బాపిరాజు, బాలసుబ్రమణ్యం, పి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం: వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్బుక్ గ్రూపులలో తప్పుడు వార్తలు ప్రచారం చేస్తే గ్రూప్ అడ్మిన్ దే పూర్తి బాధ్యత అని కృష్ణా జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి అన్నారు.జరగబోనున్న సార్వత్రిక ఎన్నికలు - మంగళవారం ఆయన ఒక ప్రకటన జారీ చేస్తూ, 2024 నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత దూషణలు, ట్రోలింగ్లు, సోషల్ మీడియా ద్వారా తప్పుడు వార్తల ప్రచారాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని, అట్టి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సామాజిక మాధ్యమాలు వినియోగిస్తున్న ప్రతి ఒక్కరు జాగ్రత్తగా వ్యవహరిస్తూ ఎలాంటి సమాచారాన్ని ఇతరులకు షేర్ చేస్తున్నాము అనేది గమనించి నడుచుకోవాలన్నారు. వాట్సాప్ గ్రూపులు నిర్వహిస్తున్న వారు ఆ గ్రూపులలో ఏదైనా అనాలోచిత / తప్పుడు సమాచారం / బెదిరింపులకు పాల్పడేవి కనుక పోస్ట్ చేయబడితే దానికి పూర్తి బాధ్యత అడ్మినే వహించాల్సి వస్తుందని, వాట్సప్, టెలిగ్రాం ఫేస్ బుక్, ఇన్స్టాగ్రామ్, ట్విటర్ (ఎక్స్) మరియు యూట్యూబ్ వంటి గ్రూప్ లో ప్రతి పోస్టుకి బాధ్యత తీసుకోవాలన్నారు. గ్రూప్ లోయాడ్చేసేప్రతిసభ్యుడు తప్పకుండా అడ్మిన్ కితెలిసి ఉండాలి.అభ్యంతకర, తప్పుడు వార్త, వదంతులు పై స్థానిక పోలీసులకు సమాచారమివ్వాలి.ఎవరైనా సభ్యులు అభ్యంతకరంగా ప్రవర్తిస్తే వెంటనే గ్రూప్నుంచి తొలగించాలి, ఆ వివాదస్పద పోస్టింగ్ సంబంధించి ఆడ్మిన్ ఏం చర్యలు తీసుకోకుంటే అతడిపై ఐపిసి మరియు సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇతరులకు షేర్చేయకూడని సమాచారం:

విద్వేషాలు మరియు రెచ్చగొట్టేవి, తప్పుడు సమాచారం అసభ్యకర, అభ్యంతర, నేరపూరితమైన మరియు బెదిరింపులకు పాల్పడేవి, కుల, మత, వర్గ మరియు రాజకీయ విద్వేషాలు రెచ్చగొట్టేవి, వ్యక్తిగత పరపతి మరియు మనోభావాలు దెబ్బతీసే విధంగా మార్ఫింగ్చేసిన ఫోటోలు, తప్పుదారి పట్టించే సమాచారం, ఇతరులకు ఎట్టిపరిస్థితిలో షేర్చేయ కూడదని, ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందువలన సామాజిక మాధ్యమాల వేదికగా అనాలోచిత ట్రోలింగ్లు, తప్పుడు వార్తల ప్రచారాలకు పాల్పడడం, ఇతరుల మనోభావాలకు భంగం వాటిల్లేల వ్యవహరించడం వంటి చట్ట వ్యతిరేకమైన పనులలో భాగస్వామం అయిన యెడల అలాంటి వారిపై చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకోనుబడతాయన్నారు.సామాజిక మాధ్యమాలలో వస్తున్న అసభ్యకర, అభ్యంతరకర, విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టింగులకు సంబంధించిన సమాచారం మీకు తెలిస్తే వెంటనే కృష్ణాజిల్లా పోలీస్ వాట్సప్ నెంబర్. 9490617672కు సమాచారం తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు.

ఎన్నికలకు సమాయత్తమవ్వాలి

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మండల కేంద్రమైన గుడ్లవల్లేరులోని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని బూత్ స్థాయి అధికారులు మరియు సూపర్వైజర్ లతో ఎంఆర్ఓ సునీల్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ముందుగా నూతనంగా వచ్చిన తహశీల్దార్ సునీల్ కుమార్ గ్రామ రెవెన్యూ అధికారులతో మాట్లాడి మండల పరిధిలోని గ్రామాల పరిస్థితిని గురించి అడిగి తెలుసుకున్నారు.అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళికి సంబంధించి ప్రతి ఒక్కరు సమాయత్తం కావాలని బూత్ స్థాయి అధికారులను ఆయన ఆదేశించారు.ఓటరు జాబితా వెరిఫికేషన్ వాటిలోని తప్పు, ఒప్పుల పైన బూత్ స్థాయి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఓటర్ల జాబితాను మరలా పునఃపరిశీలన చేసి తప్పులు లేకుండా సరిచూసుకోవాలి తెలిపారు.అలాగే గ్రామాలలో 20 ఏళ్ల వయస్సు పైబడిన వారు గానీ, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు గానీ ఈ మండల పరిధిలోని గ్రామాలలో నూతనంగా ఓటు నమోదు చేసుకోవడానికి ఫామ్ 6 దరఖాస్తు చేసుకుంటే వాటిని క్షుణ్ణంగా విచారించి, వేరే ప్రాంతాలలో ఓటు హక్కు కలిగి ఉన్నారో లేదో అని పరిశీలించి ఆ ఓటర్ దరఖాస్తును ఆమోదించాలని సూచించారు.పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను పరిశీలించి, అవసరమైన వసతులు లేని పోలింగ్ కేంద్రాల సమాచారాన్ని త్వరితగతిన తమకు తెలియజేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కనకదుర్గమ్మ, రెవెన్యూ ఇన్స్పెక్టర్ షకీలా బేగం, మండల సర్వేయర్ రామకృష్ణ, గ్రామ రెవెన్యూ అధికారులు, బూత్ స్థాయి అధికారులు, సూపర్వైజర్ లు, గ్రామ సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి సన్మానం

విశాలాంధ్ర-అవనిగడ్డ : వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్.సి సెల్ ప్రధాన కార్యదర్శిగా నలుకుర్తి రమేష్ ఎన్నిక కావడంతో ఘనంగా సన్మానించారు. శాసనసభ్యులు సింహాద్రి రమేష్బాబు తన కార్యాలయంలో మంగళవారం ఎస్.సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన శుభ సందర్భంగా దుసాలువాతో ఘనంగా సత్కరించి మాట్లాడారు. పార్టీ అభివృద్ధికి అంకిత భావంతో పనిచేసి మరిన్ని ఉన్నతమైన పదవులను అదిరోహించాలని సింహాద్రి అన్నారు. ఈ కార్యక్రమంలో దివి మార్కెట్ యార్డ్ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, జడ్.పి.టి.సి చింతలపూడీ లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ నలకుర్తి ఫృద్వీరాజ్, నాగేశ్వరరావు, గరికిపాటి కృష్ణారావులతో పాటు పలువురు పాల్గొని అభినందించారు.

'పది' పరీక్షలకు 17 మంది విద్యార్థులు గైర్హాజరు

విశాలాంధ్ర-అవనిగడ్డ :10 వ తరగతి పరీక్షలకు శనివారం 631 మంది విద్యార్థులకు గానూ 17 మంది గైహాజరయ్యారు. అవనిగడ్డలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శ్రీ చైతన్య స్కూల్, ఎన్.ఆర్.ఐ వికాస్ స్కూల్స్లో 10 వ తరగతి పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మంగళవారం పరీక్షలు జరుగుతున్న నాచురల్ సైన్స్ (ఎన్.ఎస్) పేపర్కు మొత్తం 631 మంది విద్యార్థులకు గానూ 17 గురు విద్యార్థులు పరీక్షలకు గైహాజరైనట్లు ఎం.ఇ.ఓ ఎన్ శివశంకరరావు తెలిపారు. ఎన్.ఆర్.ఐ వికాస్ స్కూల్లో 230 మంది విద్యార్థులకు గానూ 227 మంది హాజరై ముగ్గురు గైహాజరు కాగా , శ్రీ చైతన్య స్కూల్189 మంది విద్యార్థులకు గానూ 186 మంది హాజరుకాగా, ముగ్గురు గైహాజరు , ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 212 మంది విద్యార్థులకు గానూ 201 మంది విద్యార్థులు హాజరై 11 మంది గైహాజరైయ్యారు.

కూచిపూడి నాట్యాచార్యునికి పురస్కారం

విశాలాంధ్ర-కూచిపూడి : శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వార్షిక కళ్యాణోత్సవాలు లో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా నాత్యాచారుని సత్కరించారు. కూచిపూడి నాట్యం నటరాజు కీర్తిశేషులు వేదాంతం చరిత్ర పురస్కారాన్ని నాచార్యులు, శ్రీ సిద్ధేంద్ర యోగి మందిర అర్చకులు చింతా శ్రీరామ మూర్తికి బహుకరించారు. ఆయనను పండితమకుటం తో శాలువా పూలమాలలు, జ్ఞాపిక, ప్రశంసా పత్రం,నగదుతో సత్కరించి ఆయన పట్ల తమకున్న గౌరవాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ పాలకమండలి కమిటీ కావూరిభానుమూర్తి, పసుమర్తి నారాయణమూర్తి, భాగవతుల బాలకృష్ణ ప్రసాద్, డాక్టర్ ఏలేశ్వరపుహనుమంతరావు, భాగవతుల సీతాపతి రావు పాల్గొన్నారు.

ముగిసిన బాలా త్రిపుర సుందరికళ్యాణోత్సవాలు

విశాలాంధ్ర-కూచిపూడి : శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వారి 261 వార్షిక కళ్యాణోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ద్వాదశ ప్రదక్షణలు, పుష్పయాగ ఉత్సవంలను ఉభయ దాతలు భాగవతుల భాలకృష్ణ ప్రసాద్-కామేశ్వరి, భాగవతుల కుటుంబ శాస్త్రి-హనుమ సామ్రాజ్యలక్ష్మి, భాగవతుల ఫణి కుమార్-సాయి శ్రీ దంపతులు (హైదరాబాద్) నిర్వహించారు. పవళింపు వేడుకలలో అధిక సంఖ్యలో మహిళలు భక్తులు పాల్గొన్నారు. దేవాలయ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో కొనసాగిన ఈ వేడుకలను త్రయాహ్నిక దీక్షలో పూర్ణ దీక్షపరులు రాళ్లపల్లిఆంజనేయ శాస్త్రి శిష్యులు నిర్వహించారు. ఆలయ అర్చక స్వాములు పెనుమూడి పూర్ణచంద్రశేఖర శర్మ, పెనుమూడి సతీష్ కుమార్ బృందం సహకరించింది.

అందరి చూపు కృష్ణావైపు!

-ఆ రెండు చోట్ల గెలిచిన పార్టీదే ప్రభుత్వం..

-ఉమ్మడి కృష్ణాలో మచిలీపట్నం, పెడన నియోజకవర్గాలకు ప్రత్యేక స్థానం

-తాజా ఎన్నికలలో రాజకీయ విశ్లేషకులు సహా అన్నిపార్టీల దృష్టి ఆ రెండు సెగ్మెంట్లపైనే..

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అందరిచూపు కృష్ణాజిల్లా వైపే ఉంది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో మచిలీపట్నం, పెడన రెండు జంట అసెంబ్లీ నియోజకవర్గాలకు చారిత్రక ప్రాధాన్యత ఉంది. ఈ రెండు అసెంబ్లీ సెగ్మెంట్లకు ప్రాతినిధ్యం వహించే రాజకీయ పార్టీ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాయి. ఏడు అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రెండు చోట్ల గెలిచిన అభ్యర్థుల రాజకీయ పార్టీలే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తూ వస్తున్నాయి. అయితే నేడు అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రెండు ఉమ్మడి కృష్ణా జిల్లాలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అధికార వైఎస్సార్సీపీ, ప్రతిపక్ష టీడీపీ-జేఎస్పీ-బీజేపీ కూటమి ఈ నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి...

విశాలాంధ్ర-విజయవాడ (వన్టౌన్) : అసెంబ్లీ నియోజకవర్గాల విభజన తర్వాత మాత్రమే కాకుండా, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణకు ముందు కూడా ఇదే ధోరణి కొనసాగింది. బందరుగా చిరపరిచయమైన మచిలీపట్నం జిల్లా కేంద్రంగా ఉంది. మచిలీపట్నం నుంచి పెడన నియోజకవర్గ కేంద్రం 8 నుండి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రత్యేక మున్సిపాలిటీ. రెండు అసెంబ్లీ సెగ్మెంట్లను జంట నియోజకవర్గాలుగా ప్రాచుర్యంలో ఉన్న ఈ రెండు ఉమ్మడి కృష్ణా జిల్లాలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అసెంబ్లీ నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణకు ముందు పెడన మున్సిపాలిటీ మచిలీపట్నం నియోజకవర్గం లో భాగంగా ఉండేది. కాగా, మిగిలిన మండలాలు మల్లేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఉండేవి. అసెంబ్లీ నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ సమయంలో మల్లేశం స్థానంలో పెడనను కొత్తగా ఏర్పాటు చేశారు.

ఈ రెండు సీట్లు ఎవరు గెలిస్తే వారిదే అధికారం!

ఈ ఏడాది మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలు మచిలీపట్నం, పెడన అసెంబ్లీ నియోజకవర్గాలపై దృష్టి సారించాయి. ఈ రెండు సీట్లు ఎవరు గెలిస్తే రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందో ఇట్టే చెప్పేయవచ్చు. అధికార వైఎస్సార్సీపీ, ప్రతిపక్ష టీడీపీ-జేఎస్పీ-బీజేపీ కూటమి ఈ నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. రెండు ఎమ్మెల్యే స్థానాల్లో గెలిచే పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉందని రాజకీయ నేతలు అంచనా వేస్తున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్సీపీ మచిలీపట్నం, పెడన అసెంబ్లీ నియోజకవర్గాల్లో విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. మాజీ మంత్రి పేర్ని వెంకటరామయ్య (నాని) మచిలీపట్నం నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండగా, గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పెడన సెగ్మెంట్కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే 2014లో రాష్ట్ర విభజన అనంతరం మచిలీపట్నం, పెడన స్థానాలను టీడీపీ కైవసం చేసుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. రెండు స్థానాలకు మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ చీఫ్విప్ కాగిత వెంకటరావు ప్రాతినిధ్యం వహించారు. అదేవిధంగా, 2009 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు పేర్ని వెంకటరామయ్య (నాని), జోగి రమేష్లు గెలుపొందారు. కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్లో అధికారంలోకి వచ్చింది. అయితే 2004 ఎన్నికల్లో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా, పేర్ని నాని మచిలీపట్నం నుంచి, బూరగడ్డ వేదవ్యాస్ మల్లేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించారు. అలాగే 1999, 1994 ఎన్నికల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో టీడీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. 1999 ఎన్నికల్లో నడకుదిటి నరసింహారావు మచిలీపట్నం నుంచి గెలుపొందగా, 1994 ఎన్నికల్లో అంబటి బ్రాహ్మణయ్య విజయం సాధించారు. అలాగే మల్లేశ్వరం నియోజకవర్గం నుంచి 1999, 1994లో కాగిత వెంకటరావు వరుసగా విజయం సాధించారు. అయితే 1989 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులైన పేర్ని కృష్ణ మూర్తి (మచిలీపట్నం), బూరగడ్డ వేదవ్యాస్ (మల్లేశ్వరం) గెలుపొందడంతో అపుడు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అలాగే 1983లో బందరు నుంచి బొర్రా వెంకటస్వామి, మల్లేశ్వరం నుంచి అంకెం ప్రభాకరరావు టీడీపీ నుంచి గెలుపొందగా, ఆ పార్టీని స్థాపించిన ఎన్టీఆర్ తొలిసారిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అదేవిధంగా 1985లోనూ టీడీపీ అభ్యర్థులు వడ్డి రంగారావు (బందరు), కాగిత వెంకట్రావు (మల్లేశ్వరం) విజయం సాధించగా, మరోసారి ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా ప్రభుత్వం ఏర్పాటులో కీలకంగా వ్యవహరిస్తున్న మచిలీపట్నం, పెడన (గతంలో మల్లేశ్వరం) స్థానాలలో గెలుపుపై రాజకీయ విశ్లేషకులతో పాటు రాజకీయ పార్టీల నేతలంతా అధికార వైఎస్సార్సీపీ, ప్రతిపక్ష టీడీపీ దృష్టి సారిస్తున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎవరి పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందో ఈ రెండు చోట్ల వచ్చే ఫలితమే నిర్ణయించనుంది.

వైసీపీ ప్రచార బ్యానర్లు ఏర్పాటు

తొలగించిన అధికారులు

విశాలాంధ్ర-చల్లపల్లి : మండల కేంద్రమైన చల్లపల్లిలో ఎన్నికల కోడ్ను ఉల్లంఘించేలా వైసీపీ ఏర్పాటుచేసిన ప్రచార బ్యానర్ను పంచాయతీ అధికారులు తొలగింపచేశారు. ప్రధాన సెంటర్లో కాంప్లెక్స్ పై ఉన్న ప్రవేటు వ్యక్తుల నిర్వహణలో ఉన్న హోర్డింగ్కు "రైతులు కల..నా కల" పేరుతో ముఖ్యమంత్రి ఓరైతుతో దిగిన పెద్ద ప్రచార బ్యానరున్ను మంగళవారం తెల్లవారేసరికి ఏర్పాటు చేశారు. ఉదయాన్నే ప్రచార బ్యానర్ ఏర్పాటుచేసిన విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి పివి. మాధవేంద్రరావు, శానిటరీ ఇన్స్పెక్టర్ కె.సుధాకర్లు ఎన్నికల నియమావళి ప్రకారం హుటాహుటిన సిబ్బందితో బ్యానర్ను తొలగింపచేశారు.

పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన స్క్వాడ్

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం లో జరుగుతున్న పదవ తరగతి పరీక్షల లో భాగంగా మంగళవారం నిర్వహించిన జీవశాస్త్రం పరీక్షలు ఆయా కేంద్రాలలో ప్రశాంతంగా జరిగాయి. నిడుమోలు పరీక్ష కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీలు చేసింది. ఈ తనిఖీలలో అవనిగడ్డ ఈ.వో.పీ.ఆర్.డి. వి. శైలజ, ఘంటసాల మండల విద్యాశాఖ అధికారి-2 ఎండి. మోమిన్, లతోపాటు పోలీసు అధికారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ కేంద్ర సిఎస్ మీర్జాఆలీరజా, డిఓ అర్జా విజయ్ ల ద్వారా వివరాలు సేకరించారు. కాగా మండలంలోని ఏడు పరీక్షా కేంద్రాలలో 58 మంది విద్యార్థులు గైర్హాజరైనారు రెగ్యులర్ విభాగం లో 556 మందికి 553 మంది, ప్రైవేటు విద్యార్థులు 149 మందికి 94 మంది హాజరయ్యారు.

పంట కాలువలోకి లారీ బోల్తా

విశాలాంధ్ర-అవనిగడ్డ : అవనిగడ్డ - నాగాయలంక ప్రధాన పంట కాలువలోనికి ధాన్యపు లోడ్తో వెళుతున్న లారీ బోల్తా కొట్టగా ఎవరికి ఏ విధమైన ప్రమాధం జరగలేదు. మంగళవారం మోపిదేవి మండలం బొబ్బర్లంక నుండి ధాన్యం లోడ్తో నాగాయలంక ధాన్యం మిల్కు ధాన్యం లోడ్తో వెలుతున్న తరుణంలో అవనిగడ్డ సివారు బందలాయిచెరువు మలుపు వద్ద పంట కాలువలోనికి దూసుకుపోయి లారీ బోల్తా కొట్టిన సంఘటన జరిగింది. డ్రైవర్కు స్వల్ప గాయాలు కాగా ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనపై ఎస్.ఐ జి రమేష్ కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా - ఇద్దరి మృతి

20 మందికి గాయాలు

విశాలాంధ్ర-గన్నవరం : వీరపనేనిగూడెం వైన్స్ షాప్ దగ్గర మంగళవారం ఉదయం ఘోర ఆటో ప్రమాదం జరిగింది. ఉదయం 6.30 గంటలకు ఆగిరిపల్లి మండలం, గొల్లగూడెం గ్రామానికి చెందిన 22 మంది మహిళలు ఆటోలో కూలీ పని కోసం తెంపల్లికి బయలుదేరారు. సుమారు 7.00 గంటలకు ఆటో వీరపనేనిగూడెం గ్రామం వైన్స్ షాప్ సమీపంలో వచ్చే సరికి ఆటో డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ఆటో పక్కకు పల్టీ కొట్టింది. దీంతో అందరూ రోడ్డుపై పడిపోయారు. పోలీసులకు సమాచారం రాగా వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టి క్షత గాత్రులను హాస్పిటల్ కు తరలించారు. వీర్ల కృష్ణకుమారి అక్కడికక్కడే మృతి చెందగా, వీర్ల సుజాత హాస్పిటల్కు తీసుకెళ్తుండగా మార్గం మధ్యలో మృతి చెందారు. ఐదుగు శివ జువ్వనబోయిన లక్ష్మీ పార్వతి, జువ్వనబోయిన నిర్మల, గుంట్రు ధన లక్ష్మి, జువ్వనబోయిన ప్రభావతి, చెన్ను వీరమ్మ, డిల్లి నవ్య, వీర్ల సుజాత, జువ్వన బోయిన వాణిశ్రీ గాయపడగా, వారిని 108 అంబులెన్స్లో చికిత్స నిమిత్తం పిన్నమనేని ఆసుపత్రికి తరలించారు. సాకిరి నాగమణి, గుండ్రు పద్మావతి గన్నవరంలోని చేరి మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు. వీర్ల సుజాత, గన్నవరంలో చికిత్స పొందుతున్నారు. సదరు ప్రమాదానికి కారణం అయిన ఆటో డ్రైవర్పై ఆత్కూరు ఎస్ఐ పైడి బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్షతగాత్రులను నూజివీడు ఎమ్మెల్యే మేక వెంకట ప్రతాప్నాయుడు, మాజీ ఎమ్మెల్యేలు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పరామర్శించి, చనిపోయిన వారి కుటుంబాలకు సంతాపం తెలిపారు.

వాహన తనిఖీలో నగదు లభ్యం

విశాలాంధ్ర, కూచిపూడి : ఎన్నికల ప్రవర్తన నియమావళి లో భాగంగా మొవ్వ మండలం లో మంగళవారం రాత్రి పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా అయ్యంకి వద్ద వాహనంలో నాలుగు లక్షల రూపాయల నగదు లభించింది. దీనికి సంబంధించిన ఏ విధమైన నిరూపణలులభ్యం కాకపోవడంతో పోలీసులు ఆ నగదును స్వాధీనం చేసుకుని జిల్లా నిర్ధారణ కమిటీకి పంపుతున్నట్లు తెలిసింది. అయ్యంకి సమీపంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. అయ్యంగికి చెందిన వీరంకి రఘుబాబు కు చెందిన వాహనాల్లో నగదు లభించినట్లు కూచిపూడి ఎస్సై టి శ్రీనివాస్ తెలిపారు.వాహన తనిఖీలలో నగదు లభ్యం.

టీడీపీ నేతల రాజీనామా ?

జనసేన పార్టీకి వ్యతిరేకం కాదు...

గెలిసే అభ్యర్థికే టిక్కెట్ ప్రకటించాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : అవనిగడ్డ మండల తెలుగుదేశం పార్టీ నేతలు పార్టీ పదువులకు మూకుమ్మడి రాజీనామా చేశారు. పొత్తులలో భాగంగా మంగళవారం మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్కు సీటు కేటాయించకపోవడంతో నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఆ పార్టీ నేతలు సమావేశమై నిర్ణయం తీసుకున్నారు. మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు ఆద్వర్యంలో నిర్వహించిన సమావేశంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పొత్తుల్లో భాగంగా తాము జనసేన పార్టీకి వ్యతిరేకం కాదని, కూటమిలో ప్రకటించే సీటును గెలుపు ప్రతిపాదికన ఆలోచించి ఇరుపార్టీల అధ్యక్షులు మరొక మారు సర్వే చేయించి అవనిగడ్డ సీటు ప్రకటించాలని కొల్లూరి విజ్ఞప్తి చేశారు. అధికార పార్టీ అసమర్ధత వల్ల ప్రతిపక్ష పార్టీ పోరాటాల వల్ల మండలి బుద్ధప్రసాద్కు గెలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయని, పొత్తు ధర్మాన్ని మనసా, వాచా గౌరవిస్తున్నామని, ఇక ముందు కూడా అదే బాటలో నడుస్తామన్నారు. 2019 ఎన్నికల్లో ఇరు పార్టీలు వేరు వేరుగా పోటీ చేయడం వల్ల ఇక్కడ పార్టీకి నష్టం జరిగిందని, ఆ నష్టాన్ని భర్తీ చేసుకుని విజయ దుందబీ మోగించే ప్రయత్నంలో సరైన అభ్యర్థిని ప్రకటించకపోవడం తెలుగుదేశం పార్టీ అభిమానులను, కార్యకర్తలను తీవ్ర ఆందోళనకు గురిచేసిందన్నారు. నియోజకవర్గానికి సీటు ప్రకటించే విషయంలో ప్రస్తుత తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్గా ఉన్నటువంటి మండలి బుద్ధప్రసాద్కు పార్టీ అధిష్ఠానం నుండి ఇప్పటి వరకు కనీస సమాచారం రాకపోవడంపై తెలుగుదేశం శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో మనస్థాపానికి గురైన అవనిగడ్డ మండలంలోని తెలుగుదేశం నేతలు తమ పార్టీ పదవులకు రాజీనామాలు చేసి మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి పంపించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కర్రా సుధాకర్, అశ్వరావుపాలెం గ్రామ సర్పంచ్ పంద్రాజు లంకమ్మ ప్రసాద్, నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు బండె కనకదుర్గ, మాదివాడ లక్ష్మీ తులసీ, విశ్వనాధపల్లి పాప, సనకా అన్నపూర్ణమ్మ, మట్టా నారాయణమ్మ, అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, అడపా శ్రీనివాసరావు, యలవర్తి ఆది, బచ్చు రఘునాథ ప్రసాద్, బచ్చు పున్నయ్య, లుక్కా శ్రీనివాసరావు, చెన్ను గాంధీ, కంచర్ల ఆనంద్, మాదివాడ కుటుంబరావు, కటికల బాలాజీ, అశ్వరరావుపాలెం, వేకనూరు గ్రామ పార్టీ అధ్యక్షులు, దాసినేని శ్రీనివాసరావు, మాదివాడ రత్నారావు, బొప్పన కాశీ విశ్వేశ్వరరావు, బచ్చు మల్లిఖార్జునరావు, బూత్ ఏజెంట్లు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

విశాలాంధ్ర-కూచిపూడి : శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం రసమయంగా సాగాయి. కళ్యాణోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న నాట్య కార్యక్రమాలు మంగళవారం ముగిశాయి. శ్రీ దుర్గా సాయి నృత్య నికేతన్ నిర్వాహకురాలు సీతా లక్ష్మి ప్రసాద్ (కొత్తగూడెం) బృందంతో నిర్వహించిన' శ్రీ శ్రీనివాస కళ్యాణం' నృత్యరూపకం ప్రేక్షకులను ఆనంద పరవశులను గావించింది. ఈ నృత్య రూపకం కథాంశం పండిత పామరులకు సైతం విదితమే!. ఎస్ సి హెచ్ జగన్నాథ ఆచార్యుల కలం నుంచి జాలువారిన కథకు ఆయన కుమారుడు ఎస్.సి.హెచ్ బుచ్చయా చార్యులు సంగీతం సమకూర్చగా నృత్య దర్శకత్వం సీతా లక్ష్మి ప్రసాద్ సమకూర్చారు ఈ నృత్య రూపకానికి గాత్రం పై ఎన్ సి హెచ్ కాశిక్, ప్రార్థన కృష్ణ సహకరించి జీవంపోశారు. శ్రీనివాసుని/విష్ణుమూర్తిగా హరిచందన, లక్ష్మీదేవిగా శ్రీనిజ, పద్మావతిగా మనీషా, శివునిగా హాసిని, పార్వతిగా సాహితీ, వకుళామాత గా నీహారిక, భృగు మహర్షి, ఆకాశరాజు,చోళ రాజుగా మృత్యుంజయ శర్మ తదితరులు పాల్గొని నృత్య రూపకాన్ని రక్తి కట్టించారు. మయూరి నాట్యకళాక్షేత్రంకుండె అరుణ్ రాజ్ కుమార్ (వరంగల్) శిష్య బృందం వర్షిణి, సహస్ర గీతిక, నవ్య, సింధు, తిల్లానా, హనుమాన్ చాలీసా (వెంపటి చినసత్యం నృత్య రూపకం) శివాష్టకం లను ప్రదర్శించారు. హనుమాన్ చాలీసా నూతన ఒరవడిని సృష్టించింది. శ్రీ సీతారత్నలలితకళానృత్య నికేతన్(కాకినాడ) ముళ్ళపూడి విజయలక్ష్మిశిష్యబృందం. గం - గం- గణపతి, చక్కని తల్లికి చాంగుబళా, పుష్పాంజలి నృత్యాలను ప్రదర్శించారు. నాట్యాంజలి కూచిపూడి నృత్యాలయం(విజయవాడ) ఎం త్రినాధ వాని శిష్య బృందం కొలువైతివారంగసాయి, ఆనందతాండవ మాడేశివుడు అంశాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమానిర్వాహకులైన డాక్టర్ వేదాంతం రాదే శ్యామ్, డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి, డాక్టర్ చింతా రవి బాలకృష్ణ లా పర్యవేక్షణలో కళాకారులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు, అంగవస్త్రాలనుఅందజేశారు. జ్యోతిప్రజ్వలానంతరం అంబరుకుప్రార్థనతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.

విజయవాడ కొత్త ఆటోనగర్‌లో అగ్నిప్రమాదం

- ఆయిల్ శుద్ధి కేంద్రంలో చెలరేగిన మంటలు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైమ్): విజయవాడ కొత్త ఆటోనగర్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. ఆయిల్ శుద్ధి కేంద్రంలో భారీగా మంటలు చెలరేగాయి. దీంతో భయభ్రాంతులకు గురైన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న ఐదు ఫైరింజన్లు చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాద సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. అగ్నిప్రమాదానికి షార్ట్‌సర్క్యూట్ కారణమని అగ్నిప్రమాదం పై సమాచారం అందిన వెంటనే ఘటనా చేరకున్న పోలీసు అధికారులు దర్యాప్తు చేపట్టారు. సుమారు ఉదయం 8గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం ఉందని పోలీసులు తెలిపారు. అయితే ఆయిల్ కేంద్రంలో కంపెనీల్లో వినియోగించిచన మడ్ ఆయిల్‌ను శుద్ధి చేసి గ్రీసు తయారు చేస్తారు. ప్రతి రోజు ఉదయం గ్రీసు శాంపిల్స్‌ను పరీక్షిస్తారు. మంగళవారం సిబ్బంది పరిశీలించారు. హఠాత్తుగా మంటలు చెరేగాయని స్థానికులు చెబుతున్నారు. దట్టమైన పొగలతో మంటలు వ్యాపించి ఎగసిపడ్డాయి. అగ్నిమాపక సిబ్బంది వెంటనే రంగంలోకి దిగారు. ఆయిల్ కావడంతో ఫోమ్‌ను వినియోగించి ఐదు ఫైరింజన్ల సాయంతో రెండు గంటలు మంటలను అదుపులోకి తెచ్చారు. పెట్రో కెమికల్ గుణాలుండంతో మంటల వేడికి డ్రమ్ములు ఎగిసిపడ్డాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : బుధవారం సా॥ 6:25
సహరి : గురువారం ఉ॥ 4:49

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

అంతరాష్ట్ర సరిహద్దులో పటిష్ట నిఘా

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : ప్రలోబాలకు ఆస్కారం లేకుండా ఎన్నికలను నిష్పక్షపాతంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అంతరాష్ట్ర సరిహద్దుల వెంబడి ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయటంతో పాటు సరిహద్దు జిల్లాల అధికారుల మధ్య సమన్వయం కలిగి ఉన్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. జిల్లాలోని జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు టోల్ ప్లాజా సమీపంలోని రామ్‌కో లెర్నింగ్ సెంటర్‌లో కలెక్టర్ మంగళవారం సీపీ కాంతిరాణా టాటాతో కలిసి సూర్యారావుపేట జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డేతో కలిసి నియోజక వర్గాల ఆర్‌వోలు, రెవిన్యూ, పోలీస్, ఎక్సైజ్, రవాణా, ఐటీ, కమర్షియల్ టాక్స్, జీఎస్టీ, అటవీ, బ్యాంకింగ్, నోడల్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రా, తెలంగాణ, సరిహద్దు వెంబడి నగదు, మద్యం, విలువైన వస్తువులు అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, ప్రజాస్వామ్య బద్ధంగా జరిగేందుకు రెండు జిల్లాల సరిహద్దు అధికారులు మధ్య సమన్వయం, సమాచార మార్పిడితో మంచి ఫలితాలు రాబట్టవచ్చన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్‌లు క్రియాశీలంగా పని చేస్తున్నాయన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి కూడా పగడ్బందీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ముక్త్యాల, గరికపాడు, వత్సవాయి తదితర చెక్ పోస్టులు ముఖ్యమైనవని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కూడా సమర్ధవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా చెక్ పోస్టులు 24 గంటల పాటు పని చేస్తునాయని, సరిహద్దు ప్రాంత గ్రామాల్లో గత ఎన్నికల్లో చోటు చేసుకున్న సంఘటనల ఆధారంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. సూర్యారావేపేట జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులను ఏర్పాటు చేయటం జరిగిందని, ఒక్కో చెక్ పోస్టు వద్ద పది మందికి తగ్గకుండా సిబ్బందిని మోహరించినట్లు తెలిపారు. సరిహద్దు జిల్లాలకు సరైన సహకారం అందించటం ద్వారా ఎన్నికలు ప్రశాంతంగా, ప్రలోభాలకు ఆస్కారం లేని వాతావరణంలో నిర్వహించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా ఎస్పీ కాంతిరాణా టాటా, సూర్యారావేపేట జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే మాట్లాడుతూ నాలుగైదు పోలీసుస్టేషన్ల పరిదిలో 5 ఉమ్మడి చెక్ పోస్టులున్నాయని, 9 అంతరాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టులతో పాటు మరో 6 చెక్ పోస్టులు జిల్లాలోపల పని చేస్తున్నాయని, అవసరమేరకు వీటి సంఖ్యను పెంచనున్నట్లు తెలిపారు. ఆంధ్రా, తెలంగాణ సరిమద్దుకు సంబందించిన రామాపురం ఎక్స్‌రోడ్, దొండపాటు క్రాస్ పాయింట్లు వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేసి వాటిని పోలీసు కంట్రోల్ రూమ్, ఎన్నికల కంట్రోల్ రూమ్ అనుసందానించినట్లు తెలిపారు. అంతరాష్ట్ర, అంతర శాఖల చెక్ పోస్టుల్లో సీసీ టీవీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీజర్స్ రిలీజ్‌కు జిల్లా స్థాయి గ్రీవెన్సు రిడ్రైనల్ కమిటీ పని చేస్తుందని వివరించారు. ఈ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా జేసీ డా.పీ.సంపత్‌కుమార్. నందిగామ, జగ్గయ్యపేట, కోదాడ ఆర్డీవోలు రవీంద్రరావు, వెంకటేశ్వరుళ్లు, సూర్యనారాయణ, ఎన్టీఆర్ జిల్లా ఏడీసీపీ, నోడల్ అధికారి కృష్ణమూర్తినాయుడు, ఎల్డీఎం ప్రియాంక పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే శిక్షార్హులు

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగర పాలక సంస్థ నిబందనలు ఉల్లంఘించేవారు శిక్షార్హులేనని కార్పొరేషన్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి బీ.విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నగరంలో వివిధ ప్రాంతాల్లో కార్పొరేషన్ నిబందనలు ఉల్లంఘించిన పలువరుపై నగర పాలక సంస్థ అధికారులు వారిపై నమోదు చేసిన కేసులను స్థానిక వీఎంసీ సర్కిల్-2 కార్యాలయంలో మంగళవారం మొబైల్ కోర్టు నిర్వహించి ఆయా కేసులను విచారించారు. నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాలతో రోడ్లుపై చెత్త వేసిన వారిపైన, కాలువల్లో మురుగు ప్రవాహానికి అడ్డుపెట్టినవారిపైన తదితర నిబందనలు ఉల్లంఘించిన 22 మందిపై కార్పొరేషన్ అధికారులు కేసులు నమోదు చేశారు. ఆయా కేసులను విచారించిన న్యాయూర్తి వారిపై నేరం రుజువు కావటంతో వారికి రూ.5410 జరిమానా విధించారు. ఒకసారి జరిమానా విధించిన తరువాత కూడా ఆదే తప్పు కఠినంగా చర్యలు తీసుకోవటంతో పాటు లైసెన్స్ కూడా రద్దు చేయటం జరుగుతుందని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఈ సందర్భంగా హెచ్చరించారు నివాసాల ప్రజలు కానీ వ్యాపారస్తులు కానీ రోడ్లుపై ఇష్టాను సారంగా చెత్త వేసిన, మురుగు ప్రవాహానికి అడ్డుపెట్టిన, రోడ్డుపైన పెంపుడు జంతువులను ఉంచినా, లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహించిన ఆలాంటి వారిపై మొబైల్ కోర్టులో చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రామకోటేశ్వరావు, శానిటరీ సూపర్‌వైజర్‌లు నవకిషోర్, రమేష్, శానిటరీ ఇనస్పెక్టర్లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

కన్నుల పండువగా తిరుపతమ్మ రథోత్సవం

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : శ్రీగోపయ్య స్వామి సమేత శ్రీ తిరుపతమ్మ మహెూత్సవాలల్లో రెండోవ రోజు మంగళవారం రాత్రి రథోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ముందుగా ఆలయం లోని శ్రీ గోపయ్యస్వామి సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ ప్రధాన అర్చకులు మద్రే బోయిన. గోపి. ఆధ్వర్యంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి. కె. రమేష్ నాయు డు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా విగ్రహాలను బయటకు తీసుకు వచ్చి. గ్రామొత్సం కు ఉపయోహించే రథం కు వివిధ రకాల పూల దండలతో విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. అనంతరం ఆచారం ప్రకారం స్థానిక రజకులు. శాలి వాహనులు ప్రత్యేక క్రతువులు ని ర్వహిం చి.సాయంత్రం 6-26 నిముషాలకు రథోత్సవం ప్రారంభించిన్నారు. ఈ రథోత్సవం సందర్భంగా అడుగడుగునా మహిళా భక్తులు వార్లు పోస్తూ కొబ్బరికాయ లు కొడుతూ మొక్కులు చెల్లించుకూన్నారు. ఎటువంటి అవాంచనియా సంఘ టనలు జరుగకుండా నందిగామ డివిజన్ ఏసీపీ. రవికిరణ్ ఆధ్వర్యంలో ఎస్ ఐ. రాంబాబు ప్రత్యేక బందోబస్తే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు. గ్రామ పెద్ద లు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేని వారితో ప్రతిజ్ఞ

విశాలాంధ్ర-వత్సవాయి : మండల కేంద్రమైన వత్సవాయిలో లైసెన్సులు లేకుండా , లైసెన్సు పొందుటకు తగిన వయసు లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్నటువంటి వారిని ఆపి వారిచే ఇకపై లైసెన్స్ లేకుండా వాహనాలు తోలము అంటూ ప్రతిజ్ఞ చేయించారు స్థానిక ఎస్ఐ అభిమన్యు యువకుల తల్లిదండ్రులకి సదరు లైసెన్స్ లేకుండా మైనర్లు వాహనాన్ని నడిపితే ప్రమాదం జరిగే అవకాశం ఉందని అటువంటి సందర్భాలలో సదరు బండి ఎవరి పేరు మీద అయితే రిజిస్ట్రేషన్ అయి ఉంటుందో వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని అంతేకాకుండా ప్రమాదాలలో విలువైన ప్రాణాలను కోల్పోయే పరిస్థితి ఎదురవుతుందని చెప్పి సున్నితంగా మందలించి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సిలింగ్లో 40 మంది యువత ఉన్నారు.

నేడు 'ప్రజాస్వామ్యం-ఓటు హక్కుప్రాధాన్యత' పై రౌండ్‌టేబుల్ సమావేశం

విశాలాంధ్ర-విజయవాడ: సిటిజన్స్ ఫర్ డెమోక్రసి ఆధ్వర్యంలో 'ప్రజాస్వామ్యం-ఓటు హక్కు ప్రాధాన్యత' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి డాక్టర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని హెూటల్ ఐటీసీ ఫ్యూర్చ్యూన్ మురళిలో బుధవారం ఉదయం 10.30 గటంలకు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ పాల్గొంటారని తెలిపారు. సభాధ్యక్షులుగా సిటిజన్స్ ఫర్ డెమెక్రసి చైర్మన్ జస్టీస్ జి.భవానీప్రాద్ వ్యమహరిస్తారని వివరించారు.

ప్యాడ్ కళాకారుడు సురేష్‌కు సినీ స్వరనీరాజనం

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : హ్యాపీ మూమెంట్స్ అండ్ ఎంటర్టైన్మెంట్స్ వ్యవస్థాపకుడు ప్రముఖ సినీ ప్యాడ్ వాయిద్య కళాకారుడు నేరెళ్ల సురేష్ జయంతి సందర్భంగా ఆయన ధర్మపత్ని గాయనీయమణి చందన సురేష్ ఆ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కౌతా పూర్ణానందం కళావేదికపై జరిగిన సినీ సంగీత విభావరి సురేష్ కు నీరాజనార్పిస్తూ సాగింది. వ్యాఖ్యాతగా దేవిడ్ రాజు వ్యవహరించగా గాయని గాయకులుగా ఉమా మహేష్, చందన, విష్ణుప్రియ, పావని, కంచి మల్లేశ్వరి, రేష్మ, దేవిడ్ రాజు, జోషి, ప్రిన్స్, సాయిబాబా, శ్యాంప్రసాద్, జయప్రభ, శ్రీనివాస్ తదితరులు కన్నుల్లో మిసమిసలు, ఎవరికి ఎవరు, ఇక్కడే కలుసుకున్నాము, విన్నానులే ప్రియా, మధు ఒలకబోసే, ఊహలు గుసగుసలాడే, మాటే మంత్రము, లలిత ప్రియ కమలము వంటి ఇత్యాది పాటలను రసరమ్యంగా పాడి వినిపించారు. వీరికి కీబోర్డ్ తో రవి, జయరాజ్, ప్యాడ్స్ తో ప్రవీణ్, గిటార్ తో హంటింగ్ ప్రసాద్, జాజ్ తో రామ్ కుమార్, తబలాతో ఇజ్రాయిల్, డోలక్ చిట్టిబాబు, కాంగోస్ తో ఎస్ రమణ, మువ్వల తో ఎ రామ్మోహనరావు లు నిండుగా సహకరించారు. అతిథులుగా బివి వీరభద్రరావు, జ్ఞాన కిషోర్ తదితరులు స్నేహశీలి, ప్యాడ్ కళాకారుడు నేరెళ్ల సురేష్ ఆప్యాయత, స్నేహ బంధం గురించి మాట్లాడారు.

రైల్వే ఉద్యోగులు సీనియర్స్ టెన్నిస్‌లో డబుల్స్ విన్నర్స్ ట్రోఫీ

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ఆల్ ఇండియా ఓపెన్ సీనియర్స్ టెన్నిస్ ర్యాంకింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఈనెల 20 నుండి 24 వరకు భీమవరంలో నిర్వహించారు.అందులో 54 ఏజ్ గ్రూప్ డబుల్స్ ఈవెంట్‌లో డివిజనల్ ఉద్యోగులు అయిన సీనియర్ టెక్నీషియన్ (ట్రైన్ లైటింగ్) ఎ.శ్రీనివాసరావు,టెక్నీషియన్ గ్రేడ్-1(మార్షలింగ్ యార్డ్) కె సంపత్ కుమార్, ప్రథమ స్థానంలో నిలిచి డబుల్స్ విన్నర్స్ ట్రోఫీని పొందారు.డబుల్స్ ఓపెన్ టోర్నమెంట్‌లో మూడో సీడ్ ర్యాంకింగ్‌తో ఎ శ్రీనివాస్ రావు, కె సంపత్ కుమార్ పాల్గొన్నారు.టోర్నమెంట్ ఫైనల్స్‌లో టాప్ సీడ్ మణికందన్ (తమిళనాడు),కెవిఎన్ మూర్తి (తెలంగాణ)లను ఓడించారు. వీరిద్దరూ సెమీఫైనల్లో ఇంటర్నేషనల్ టెన్నిస్ ఫెడరేషన్ ప్లేయర్లు సుబ్రమణ్య గోపాల కృష్ణన్, మిస్టర్ సంజయ్ దర్బాను ఓడించి ఫైనల్స్‌కు చేరుకున్నారు.ఈ సందర్భంగా డిఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్,ఏడిఆర్ఎంలు పి.ఈ ఎడ్విన్ (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్),ఎమ్.శ్రీకాంత్ (ఆపరేషన్స్) సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమీషనర్ & స్పోర్ట్స్ ఆఫీసర్, మరియు శ్రీ వల్లేశ్వర.బి తోకల విజేతలు అయిన సంపత్ కుమార్, శ్రీనివాసరావులను డిఆర్ఎం చాంబర్‌లో డబుల్స్ ఈవెంట్‌లో వారి అత్యుత్తమ ప్రదర్శించి ట్రోఫీని గెలుచుకున్నందుకు అభినందించారు.

పాత కక్షలతో పరస్పర దాడులు

ముగ్గురికి తీవ్రగాయాలు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైమ్): విజయవాడలో పాత కక్షలతో బంధువుల పరస్పర దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటన మంగవారం విజయవాడ టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం విజయవాడ వించిపేటకు చెందిన తుపాకుల లక్ష్మీ తన కుటుంబంతో కలిసి నివాసముంటుంది. అదే భవనంలో మేనలుడ్లు ఉంటున్నారు. వీరి మధ్య కొంత కాలంగా ఆస్తి వివాదాదం గోడవలు జరుగుతున్నాయి. ఈనేపధ్యంలో సోమవారం అర్ధరాత్రి ఇద్దరి మధ్య గోడవ జరిగింది. దీంతో మేనలుడ్లు వడ్డాది చరణ్, వడ్డాది కిరణ్‌కుమార్‌లు కత్తి తీసుకుని మేనత్త లక్ష్మీ పై దాడికి పాల్పడ్డారు. అడ్డువచ్చిన లక్ష్మీ కుమారుడు దుర్గా సాయి ప్రశాంత్(28), కుమార్తె సోనీ (25)లపై కత్తితో దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురికి తీవ్రగాయాలైయ్యాయి. రక్తపు గాయాలైన బాధితులను స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిడ్నీ బాధితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-ఏ కొండూరు : మండలంలోని చీమలపాడు హరిజనవాడలో కిడ్నీ వ్యాధితో మృతి చెందిన బొబ్బలపాటి రామస్వామి (54) మట్టి ఖర్చుల నిమిత్తం మృతుని కుటుంబ సభ్యులకు చీమలపాడు సర్పంచ్ మోర్ల లక్ష్మి సాంబశివరావు పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిడ్నీ వ్యాధుల వల్ల చిన్న వయసులోనే పలువురు మృతి చెందడం బాధాకరమని కుటుంబాన్ని పోషించేవారు కిడ్నీ వ్యాధుల వల్ల మృతి చెందడం వల్ల వారి కుటుంబ సభ్యులు ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు అలానే వారి పిల్లలను చదివించడం కుటుంబ సభ్యులకు భారంగా మారిందని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జెడ్పిటిసి భూక్య గనియ పిఎసిఎస్ అధ్యక్షుడు గుర్రాల వెంకట్రావు మొక్కల కత్తి సంసోను ఎంపీటీసీ కోలా నాగలక్ష్మి నరసింహారావు సచివాలయ కన్వీనర్ షేక్ షాజహాన్ పాలెం బాలకృష్ణ ఎమ్ జయరాజు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశాం : ఎమ్మెల్యే మొండితోక

విశాలాంధ్ర- నందిగామ: నందిగామ పట్టణంలోని మెయిన్ బజార్ 5వ వార్డులో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి ప్రతి గడపకు తిరుగుతూ స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో ఎమ్మెల్యే గా నా ఐదేళ్ల పదవీకాలంలో నియోజక వర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేశా ముఖ్యంగా గత నందిగామను - ప్రస్తుత నందిగామను పోల్చుకుంటే ఎంత అభివృద్ధి జరిగిందో స్పష్టంగా కనబడుతుంది. నందిగామ లో ప్రధాన రహదారులు చందర్లపాడు, రామన్నపేట రోడ్లను విస్తరించి,అభివృద్ధి చేశాం.సీఎం రోడ్డును అభివృద్ధి చేసి ఎన్.టీ.ఆర్. రోడ్డుగా మార్చాం.పట్టణంలో రూ.20 కోట్లతో మేజర్ డ్రైనేజీల నిర్మాణాలను పూర్తిచేశాం నంది గామకు రెవిన్యూ డివిజన్ సాధించాం. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు,వంద పడకల ఆసుపత్రి మంజూరు, రూ.1.30 కోట్లతో శివాలయం అభివృద్ధి పనులకు శంకుస్థాపన, కేంద్రీయ విద్యాలయం మంజూరు, నగర పంచాయతీ నుండి మున్సిపాలిటీగా అప్ గ్రేడేషన్, అనాసాగరం- డివిఆర్ కాలనీలలో వైయస్సార్ హెల్త్ క్లినిక్ లను ఏర్పాటు చేశాం బాబు జగ్జీవన్ రామ్ భవనాన్ని అత్యాధు నికంగా అభివృద్ధి చేశాం.నిరుపేదల సొంతింటి కల సాకారం చేసే విధంగా పట్టణ పరిధిలో 3 లే అవుట్లలో ఇల్లు లేని పేదలకు 2250 మందికి ఉచితంగా ఇళ్ల పట్టాలు అందజేశాం.నాడు - నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశాం. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శిగా చిట్టిపాటి వెంకటేశ్వర్లు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా చిట్టిపాటి వెంకటేశ్వర్లు ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కమటీ సభ్యులు తెలిపాలరు. మంగళవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కమిటీ సభ్యులు ఎన్.విష్ణు,వంకల మాధవ రావు, సి.ఎస్.సాగర్ మాట్లాడుతూ మా కమిటీ సమావేశం నిర్వహించి పలు తీర్మాణాలు చేశామన్నారు. ముఖ్యంగా చంద్రన్న కేంద్ర నాయకత్వాన్ని తిరస్కరించాలన "మెజారిటీ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మాణం చేశారన్నారు. అలాగే నూతన కార్యదర్శిగా చిట్టిపాటి వెంకటేశ్వర్లును ఎన్నుకున్నామ న్నారు. మార్క్సిజం- లెనినిజం - మావో ఆలోచనా విధానం వెలుగులో దేశంలోని అర్ధవలస - అర్ధభూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా సాగుతున్న ప్రతిఘటనా పోరాటాలను బలోపేతం చేయాల్సిన ఆవశ్యకతను గుర్తిస్తూ అందులో కలిసి రాగల సంస్థలతో, పార్టీలతో ఐక్య కార్యచరణకు,ఐక్యతకు కృషి చేస్తామని తెలిపారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి : శోభన్‌బాబు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విద్యార్థులు తమకు ఎదురైన అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నతంగా ఎదగాలని కృష్ణా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కే శోభన్‌బాబు అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల గ్రాడ్యుయేషన్ డే (డిగ్రీ పట్టాల ప్రధానోత్సవం) కార్యక్రమం ఆ కళాశాల ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం అత్యంత సందడిగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హజరైన ఆచార్య కే శోభన్‌బాబుఈ మాట్లాడుతూ విద్యార్ధులు తమతమ రంగాల్లో చోటు చేసుకున్న మార్పులను గమనిస్తూ ఆయా అంశాలపై పట్టు సాధించాలన్నారు. నూతన సాంకేతిక విప్లవాన్ని అందిపుచ్చుకునే దిశగా విద్యార్థులు పాటుపడాలన్నారు. విద్యార్థులు చదువుకున్న వారిగా సమాజం పట్ల, తల్లిదండ్రుల పట్ల ప్రేమాభిమానాలను, బాధ్యతలను కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు టీ శేషయ్య, కోశాధికారి అన్నం రామకృష్ణారావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ రమేష్ వైస్ ప్రిన్సిపాల్స్ పీఎల్ రమేష్, డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, డాక్టర్ కే రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు వివక్ష చూపుతున్నారు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : గన్నవరం పోలీసులు తను చేసిన ఫిర్యాదును పట్టించుకోక తనపట్ల వివక్ష చూపిస్తున్నారని నిందితులకు అండగా ఉంటున్నారని బాధితురాలు సోని ప్రశాంతి ఆరోపించారు.మంగళవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో భాజపా ఎస్సీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు బొడ్డు నాగలక్ష్మి, ఎంఆర్‌పీఎస్ మహిళా విభాగం గన్నవరం మండలం అధ్యక్షురాలు కొమ్మని కవితతో సోని ప్రశాంతి మాట్లాడుతూ బాపులపాడు మండలానికి చెందిన తాను తన భర్త బ్కైరాతో వచ్చిన విబేధాల నేపథ్యంలో భరణం కోరేందుకు గన్నవరంలోని అడ్వకేట్ చెనుబోయిన అంజయ్యను కలసి కేసు వేయమని అభ్యర్ధించానన్నారు. తన కార్యాలానికి రమ్మని చెప్పగా వెళ్లిన తనపై అడ్వకేట్ తన చేయి పట్టుకుని అసభ్యంగా ప్రవర్తించి, తనతో కలసి ఒంటరిగా గడిపితే కేసు విషయంలో సహాయం చేస్తానని చెప్పాడన్నారు.భయపడి తాను అక్కడి నుంచి పారిపోయి గన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.సంఘటన జరిగిన అనంతరం అంజయ్య మేనల్లుడు మహేష్ అనే ట్రాఫిక్ కానిస్టేబుల్ మరో ఇద్దరు అడ్వకేట్లులతో కలసి అక్కడికి వచ్చి తనను బెదిరించారని ఫిర్యాదులో ఆమె తెలిపారు. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేసినా ఇంత వరకు వారిపై తగిన చర్యలు తీసుకోలేదని ఆమె ఆరోపించారు.తక్షణం వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తనపై అసభ్యంగా ప్రవర్తించిన అడ్వకేట్ అంజయ్యపై బార్ అసోసియేషన్‌లోను ఫిర్యాదుచేయనున్నట్లు తెలిపారు.దళితుల భూములను కబ్జా చేస్తూ,న్యాయం కోసం వచ్చిన వారిని వేధిస్తోన్న అడ్వకేట్ అంజయ్యను అరెస్టు చేసి బాధితులకు న్యాయం చేయాలని ఎంఆర్‌పీఎస్ మహిళా విభాగం గన్నవరం మండలం అధ్యక్షురాలు కొమ్మని కవిత డిమాండ్ చేశారు. భాజపా ఎస్సీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు బొడ్డు నాగలక్ష్మి మాట్లాడుతూ ఎఫ్ఐఆర్ నమోద్కైనా నిందితుడిని అరెస్టు చేయకపోవడాన్ని ఖండించారు.ఈ అంశాన్ని డీజీపీ, మహిళా కమిషన్ దృష్టికి తీసుకెళ్లి న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు.

IN THE COURT OF THE HON'BLE XII ADDL. DISTRICT JUDGE AT VIJAYAWADA
E.P.No. 1637 / 2019
IN
A.O.P. No. 245 / 2015

Between :
M/s. Shiram Transport Finance Co. Ltd.,
Rep. by its Authorized Signatory ...DHR/Claimant
Vs
1. Viyyapu Rama krishna
2. Nancharaiah Jannu ...JDRs/Respondents

NOTICE TO JDR NO.1&2 / RESPONDENTS

Viyyapu Rama Krishna, S/o. Rama Babu, D.No: 54-16-3/26, Sri Nagar Colony, Gunadala, Vijayawada - 520004.
Nancharaiah Jannu, S/o. Masiah, F.No: 34, Block No.10, Autonagar, vijayawada - 520007.
Take notice that the above Execution Petition failed by the DHR / Claimant praying orders against JDR 1&2. The same is posted to **27/03/2024** for your appearanc on that day you should attend the court in person or through an advocate at 10.30 A.M. failing which the matter will be decided in your absence by the Hon'ble Court.

(By order of the Hon'ble Court)
DASARI RAJASEKHAR, M.Sc., M.L.,
Smt. S.ARUNA, B.A., LL.M.,
Advocates,
D.No. 29-1-30A, Seshadrisastry St.,
Governorpet, Vijayawada-2.
Mobile No. 94405 79897

IN THE COURT OF THE HON'BLE XII ADDL. DISTRICT JUDGE AT VIJAYAWADA
E.P.No. 1 / 2019
IN
A.O.P. No. 691 / 2012

Between :
M/s. Shiram Transport Finance Co. Ltd.,
Rep. by its Authorized Signatory ...DHR/Claimant
Vs
1. Palle Santhosh Kumar
2. Kethuboina Tirupal ...JDRs/Respondents

NOTICE TO JDR NO.1&2 / RESPONDENTS

Palle Santhosh Kumar, S/o. Ramu, D.No: 41-1/1-155/1, Peeter Road, Krishna Lanka, Vijayawada - 520013.
Kethuboina Tripal, S/o. Venkateswarlu, H.No:41-22/3-66, Swaragapuri Road, Krishna Lanka, Vijayawada - 520013.
Take notice that the above Execution Petition failed by the DHR / Claimant praying orders against JDR 1&2. The same is posted to **27/03/2024** for your appearanc on that day you should attend the court in person or through an advocate at 10.30 A.M. failing which the matter will be decided in your absence by the Hon'ble Court.

(By order of the Hon'ble Court)
VULISE BRAHMAJI, M.A., L.L.M.,
Advocate,
D.No. 8-268, Near Vijayalakshmi
Theatre, Kanuru Road,
Kamalahthopu,
NTR District - 520007
Cell No: 9440636278.
Mail ID: bjlawassociates@gmail.com

'భరతనాట్యం' చిత్ర బృందం సందడి

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట: క్రైమ్,కామెడి ఎలిమెంట్స్ తో తెరకెక్కిన భరతనాట్యం చిత్రం ఏప్రిల్ 5 వ తేదీన విడుదల కానున్నట్లు ఆ చిత్ర కథానాయకుడు సూర్య తేజ ఏలే తెలిపారు.నగరంలో భరతనాట్యం చిత్ర బృందం సందడి చేసింది.ఆ చిత్ర ప్రమోషన్స్ లో భాగంగా విజయవాడలోని ఓ ప్రముఖ హోటల్ నందు ఆ చిత్ర యూనిట్ ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో చిత్ర కథానాయకుడు సూర్యతేజ ఏలే మాట్లాడారు....క్రైమ్,కామెడి ఎలిమెంట్స్ తో ఈ చిత్రం ఉంటుందన్నారు.ఏప్రిల్ ఐదో వ తారీఖున ఈ చిత్రం ప్రేక్షకులు ముందుకు రానుందన్నారు.ప్రతి ఒక్కరు చిత్రాన్ని చూసి ఆదరించాలని కోరారు.ఈ చిత్రానికి తానే కథను రాశానని,రాసే సమయంలో ఈ చిత్రంలో హీరోగా నటిస్తానని అనుకోలేదన్నారు.తప్పనిసరి పరిస్థితుల్లో హీరోగా నటించాల్సి వచ్చిందన్నారు..సినిమాలోని ప్రతి సన్నివేశం ప్రేక్షకుడిని ఉత్కంఠ పరిచేలా ఉంటుందని చెప్పారు. అనంతరం ప్రొడ్యూసర్ పాయల్ సరఫ్ మాట్లాడుతూ..ప్రొడ్యూసర్ గా ఇది తనకు తొలి చిత్రం అని,అమ్మవారి ఆశీర్వచనాలతో ఈ చిత్రం ప్రమోషన్స్ విజయవాడ నుంచి ప్రారంభించామని చెప్పారు.చిత్రం ప్రమోషన్స్ లో భాగంగా విజయవాడకు వచ్చామని, రాజమండ్రి ,కాకినాడ ,వైజాగ్ వెళ్తున్నామని తెలిపారు.పి ఆర్ బ్యానర్స్ పైన ఈ చిత్రం విడుదల కానుందన్నారు. అనంతరం హీరోయిన్ మీనాక్షి గోస్వామి మాట్లాడుతూ తెలుగులో నటిస్తున్న మొదటి చిత్రాన్ని ప్రేక్షకులు విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఈ చిత్రంలో తన క్యారెక్టర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది అన్నారు. తదనంతరం డైరెక్టర్ కెవిఆర్ మహేంద్ర మాట్లాడుతూ...తన తొలి చిత్రం దొరసాని పెద్ద హిట్ అయిందన్నారు.ఆనంద్ దేవరకొండ తో తొలి చిత్రం తీశానని, రెండో చిత్రం కూడా నూతన నటీనటులతో తీశానని చెప్పారు.భరతనాట్యం అనే టైటిల్ మూవీకి రిలేటెడ్ గా ఉండబోతుందన్నారు.ఈ చిత్రంలో సీనియర్ నటులు అజయ్ గోష్, కమెడియన్ హర్ష, హర్షవర్ధన్ నటించారని తెలిపారు.ఈ చిత్రానికి సంబంధించి ట్రైజర్ ట్రైలర్ కు విశేష స్పందన లభించిందన్నారు.కంటెంట్ ఉంటే చిన్న చిత్రాలు కూడా విజయాన్ని సాధిస్తాయని,ఏప్రిల్ 5 న ప్రతి ఒక్కరూ థియేటర్లకు వచ్చి చిత్రాన్ని చూసి ఆదరించాలని కోరారు.చిత్రం ప్రమోషన్స్ లో భాగంగా విద్యార్థులను కలిసినప్పుడు విశేష స్పందన లభించిందని చెప్పారు

ఫెడరల్ స్కిల్ అకాడమీ సేవలు పట్టభద్రులు వినియోగించుకోవాలి

విశాలాంధ్ర విజయవాడ లబ్బీపేట : ఫెడరల్ బ్యాంక్ తన వ్యాపార సామ్రాజ్యాన్ని రోజు రోజుకు విస్తరిస్తుంది. దీనిలో భాగంగానే విజయవాడలోని కానూరులో తన మరో బ్రాంచ్ ను ప్రారంభించారు. దీనితో పాటుగా ప్రాంతీయ కార్యాలయాన్ని కూడా కానూరు ప్రజానికానికి అందుబాటులోకి తీసుకుని వచ్చిందన్నారు. కేవలం వ్యాపార కార్యకలాపాలకు మాత్రమే పరిమితం కాకుండా సామాజిక సేవకు కూడా ప్రాధాన్యం ఇస్తుందనన్నారు. ఫెడరల్ స్కిల్ అకాడమీ పేరుతో డిగ్రీ పూర్తి అయిన విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తుందనన్నారు. సుమారు మూడు నెలలు పాటు వివిధ కోర్సుల్లో శిక్షణ పూర్తి అయిన విద్యార్థులకు సర్టిఫికెట్లు కూడా ఇస్తుమన్నారు. మూడు నెలల శిక్షణాకాలం పూర్తి అయిన తరువాత పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా శిక్షణార్థులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారన్నారు. ప్రస్తుతం అకాడమీలో ట్యాలీ, ఎమ్మెస్ ఆఫీస్ ఇతర కోర్సులను అందిస్తున్నారన్నారు. సర్టిఫైడ్ ట్రైనర్లతోనే శిక్షణ ఇస్తున్నామని, ఫెడరల్ బ్యాంక్ సీఎస్ఆర్ నిధులతో ఈ స్కిల్ అకాడమీలను నడిపిస్తున్నట్లు ప్రాంతీయ కార్యాలయ అధిపతి (రీజనల్ హెడ్, డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్) జయ శేఖర్ రెడ్డి తెలిపారు. దేశ వ్యాప్తంగా ఫెడరల్ స్కిల్ అకాడమీలు మొత్తంగా ఆరింటిని ఏర్పాటు చేసినట్లు జయ శేఖర్ రెడ్డి పేర్కొన్నారు. అయితే విజయవాడ కానూరులో ఏర్పాటు చేసిన స్కిల్ అకాడమీ దేశంలోనే ఏడోదని చెప్పారు. డిగ్రీ పూర్తి చేసి నిరుద్యోగులుగా ఉన్న పట్టభద్రులకు స్కిల్ అకాడమీ సదావకాశం కల్పిస్తుందని అన్నారు. పట్టభద్రులు ఈ అవకాశాలను మరింత అందిపుచ్చుకోవాలి కోరారు.

కృత్రిమ మేధస్సు వినియోగంతో సత్ఫాలితాలు : సమాన

విశాలాంధ్ర-విజయవాడ ఎడ్యుకేషన్: నిత్యజీవితంలో అనేక కార్యకలాపాల నిర్వహణకు కృత్రిమ మేధస్సు (ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్) వినియోగం అవసరం ఉంటోందని సమన విద్యాసంస్థల అదినేత్రి సమాన మూసవి పేర్కొన్నారు . మంగళవారం బెంజిసర్కిల్ లొని సమన విద్యాసంస్థల ప్రాంగణంలో ఫాషన్ డిజైనింగ్ లో కృత్రిమ మేధస్సు (ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్) కోర్సును అమె ప్రారంభించారు . కృత్రిమ మేధస్సు ను ఫాషన్ విద్యార్థులు కూడా తమ విద్యతో పాటు చేర్చి చదవడం వల్ల అనేక అద్భుతాలు ఆవిష్కరించబతాయన్నారు . ప్రపంచం మొత్తం కృత్రిమ మేధస్సు (ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్) ను వినియోగించుకుని వడి వడి అడుగులు వేస్తున్నప్పుడు తాము ఫాషన్ డిజైనింగ్ లో రాష్ట్రంలో తొలిసరిగా ప్రవేశపెట్టామన్నారు . తక్షణ ఉపాధి ఉద్యోగ అవకాశాలున్న ఫాషన్ రంగానికి కృత్రిమ మేధస్సు తోడైతే రాబొయే రోజుల్లొ ఫాషన్ రంగ సేవలు అతితక్కువకాలంలోనే వినియోగదారులకు అందుతాయన్నారు . సమన విద్యాసంస్థలు మారుతున్న కాలానికి అణుగుణంగా విద్యార్థులను అప్డేట్ చేస్తుందన్నారు . ఈకార్యక్రమంలొ సమాన విద్యాసంస్థల డైరెక్టరు అల్తఫ్ హుస్సెన్ తదితరులు పాల్గోన్నారు .

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-చల్లపల్లి : రాంకీ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని విశ్రాంత ప్రిన్సిపాల్ టి.సాంబశివరావు అన్నారు. చల్లపల్లిలో దివంగత జర్నలిస్ట్ కళ్లేపల్లి చంద్ర కుమారుడు హేమంత్ బి.టెక్ విద్యాభ్యాసం కోసం ఫౌండేషన్ అందించిన రూ. 12వేల చెక్కు అందచేశారు. నిరుపేద విద్యార్థి కుటుంబ పరిస్థితిని ఫౌండేషన్ సీఎస్ఆర్ మేనేజర్ చాట్రగడ్డ మహేంద్రబాబు చైర్మన్ రామిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన ఆర్థిక సాయం మంజూరుచేశారు. ఈ సహాయాన్ని చల్లపల్లి రాజా పూర్వవిద్యార్థుల అసోసియేషన్ ద్వారా విశ్రాంత ప్రిన్సిపాల్ టి.సాంబశివరావు, అధ్యక్షులు గోవిందరాజుల అశ్వినీకుమార్ లు విద్యార్థి తల్లి.. సోదరిలకు అదించారు.

నాగేశ్వరరావు కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-పెడన: పెడన పట్టణంలో నిరుపేదలకు అవసరం అని తలిస్తే స్పందించే హృదయం మేమున్నాం సేవా సంస్థ సభ్యులకు ఉండటం నేటి యువతకు ఆదర్శం అని పలువురు కొనియాడారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలో రెండో వార్డు పడమట వీధికి చెందిన రైలు పట్టాల పక్కన నివాసం ఉంటున్న పేరక నాగేశ్వరరావు(82) సంవత్సరాలు సోమవారం రాత్రి అనారోగ్య రీత్యా ఆకలి బాధ తాళలేక కాలం చేశారు.స్థానికులు మేమున్నాం సేవా సంస్థ ద్వారా విషయం తెలుసుకొని 3000 రూపాయలు నగదు తక్షణ సహాయంగా మేమున్నాం సేవా సంస్థ తరపున ఫౌండర్ అండ్ చైర్మన్ వీణం. శ్రీనివాస్ మిత్రబృందం ఆ అభాగ్యం అంతిమయాత్రకు సహాయం అందించారు. ఈ కార్యక్రమంలోయర్రా. ప్రసాద్, సిద్దిక్, సలాం, నల్లా. సాయిబాబు, షేక్ అమీర్ (హన్నా) స్థానిక తాపీ పనివారలు మరియు మిత్రులు మహిళలు స్థానిక బంధువులు పాల్గొని సహాయం అందించారు

దళితులపై దాడిచేసన వారిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : దళిత యువకుడు ఆంజనేయులై దాడి చేసిన అగ్రకుల దరంహోకారులను అరెస్ట్ చేయటం, అలాగే కౌంటర్ కేసు ఎత్తివేయాలని, బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమో చదువుతున్న నవదీప్పై కళాశాల లెక్చరర్ దాడి చేసి గాయపడ్డారని తక్షణం ఈ రెండు కేసుల్లో బాధితులకు తగు న్యాయం చేసి దోషులపై కఠిన చర్యలు తీసుకొవాలని లేకుంటే దళిత సంఘాల ఐక్యవేదిక ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అందోళనలు చేస్తామని నాయకులు హెచ్చరించారు. మంగళవారం గాంధీనగర్లోని ప్రెస్క్లబ్లో దళిత సంఘాల ఐక్యవేదిక తరుపున నిర్వహించిన విలేకరుల సమావేశంలో బాధితులు ఆంజనేయుల, బోణిగల నవదీప్ కుమార్లతో కలసి మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల ఫ్రాన్సిస్ రాజు మాట్లాడుతూ ప్రకాశం జిల్లా, త్రిపురాంతకం మండలం ఎండూరు వారి పాలెంలో దళితుడైన వై.టి ఆంజనేయులు ఇంటి వద్ద డ్రైనేజీ విషయంలో పంచాయతీ సెక్రెటరీకి చెప్పగా ఆదిపత్య అగ్రకులాలకు చెందిన బాసిపోయిన పేరయ్య, తోట గోవర్ధన్ తమపైనే ఫిర్యాదు చేసేంత మొనగాడివా, కులము తక్కువ నా కొడకా అంటూ ఇష్టవంచినట్లు దూషించటమే కాకుండా దారుణంగా కొట్టారన్నారు.గాయపడిన అతను ముందుగా డయల్ 100 ద్వారా పోలీసు ఫిర్యాదు చేసి, గుండెనొప్పి ఉండటం కారణంగా హాస్పిటల్లో చేరటం జరిగిందని అయితే అత్యవసర వైద్యం అందవలసి ఉన్నట్లు వైద్యులు గుర్తించి ఎర్రగొండ పాలెం ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారన్నారు.ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేశారని మరలా అదే రోజు బాధితుడు పైన ముద్దాయి బాసిపోయిన పేరయ్య కుమార్తెను అసభ్యకరంగా ఫోటోలు తీసారని కౌంటర్ కేసు అక్రమంగా పెట్టించారన్నారు.తక్షణం దాడి చేసిన వారిని అరెస్టు చేసి,ఆంజనేయులుపై పెట్టిన కౌంటర్ కేసును తీసివేయాలని లేకుంటే జాతీయ ఎస్సీ కమిషన్,మానవ హక్కుల కమిషన్ కలుస్తామని, పోలీస్ స్టేషన్ న్యాయం జరగబోతే డీజీపీని కూడా కలుస్తామని అప్పటికి న్యాయం జరగకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంద్ర మాల్యాద్రి మాట్లాడుతూ బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లమో చదువుతున్న బునిగల నవదీపిని అదే కళాశాల లెక్చరర్ ఆధిపత్యకులానికి చెందిన బాలాజీ గతంలో విహారయాత్రలో తన మిత్రుడితో కలిసి సిగరెట్ తాగుతున్న ఫోటోలు చూపించి నవదీప్ను రూమ్ లోకి పిలిపించి మీ కెందుకురా చదువులంటూ కర్రతో విపరీతంగా కొట్టాడని దెబ్బలు తిని ఇబ్బందులు పడుతున్న నవదీపిని ప్రభుత్వాసుపత్రిలో మిత్రులు చేర్చారన్నారు.పోలీసులు ఎస్సి అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు కాని ఎఫ్.ఐ.ఆర్ కట్టడంలో నిర్లక్ష్యంగా ఉండి రాజీ చేసుకోమని వత్తిడి తీసుకువస్తున్నారన్నారు. ఆ లెక్చరర్పై కళాశాల యాజమాన్యం కూడా చర్యలు తీసుకోలేదని వెంటనే చర్యలు తీసుకోవాలని, కేసులను తప్పుదోవ పట్టిస్తున్న పోలీసులపై శాఖపారమైన చర్యలు తీసుకోవాలని కళాశాల యాజమాన్యంపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు పేద్యం ప్రసాద్ రావు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో సంక్షేమ పథకాలు : ఉప్పాల

విశాలాంధ్ర-గూడూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి పాలనలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని జెడ్పీ ఛైర్ పర్సన్ ఉప్పాల హారిక అన్నారు. గూడూరు మండలం కోకనారాయణపాలెం గ్రామం ఎన్నికల ప్రచారంలో భాగంగా "ప్రజా దీవెన" కార్యక్రమంలో పాల్గొని గడపగడపను సందర్శిస్తున్న పెడన నియోజకవర్గ శాసనసభ అభ్యర్థి ఉప్పాల రాము మరియు కృష్ణాజిల్లా జడ్పీ ఛైర్ పర్సన్ ఉప్పాల హారిక .ఈ కార్యక్రమంలో రాము ఎన్నికల కరపత్రం పంపిణీ చేస్తూ మాట్లాడుతూ ఒక్కసారి ఆలోచించి ఓటు వేయండి.. మీకోసం ఒక అన్నలా, తమ్ముడిలా పనిచేస్తా.సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందేలా చేశాం. మీ సమస్య.. నా సమస్యగా భావించి వాటిని తీర్చే బాధ్యత నాది అని తెలియజేస్తున్నాను. మీకోసం ఒక అన్నలా, తమ్ముడిలా పనిచేస్తానని హామీ ఇస్తున్నానని తెలిపాను.ఈ కార్యక్రమంలో పెడన నియోజకవర్గ ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారుబి

ప్రపంచ శాంతి అందరికి అవసరం : ఫాదర్ గుజ్జుల

విశాలాంధ్ర-గుడివాడ : ప్రపంచ శాంతిని కోరుతు స్థానిక ఏలూరురోడ్డులోని మౌంట్ కార్మెల మాత దేవలయం(ఆర్సియం) విచారణ పరిధిలోని సుమారు 50 మంది దీక్షపరులు గుడివాడ నుండి గన్నవరం సమీపంలోని పెద్దఆవుటపల్లి లోని దైవ సేవకుడు జోషఫ్ తంబి సమాధి వద్దకు బైక్లతో ర్యాలీగా వెళ్ళారు. మంగళవారం స్థానిక ఏలూరురోడ్డులోని ఆర్సియం దేవాలయం వద్ద విచారణ గురువు ఫాదర్ గుజ్జుల మైఖేల్, సహాయగురువు ఫాదర్ జాన్హరిష్లు బైకు ర్యాలీని ప్రారంభించారు. అనతరం వారు మాట్లాడుతూ నేడు ప్రపంచంలో శాంతి లేదన్నారు. ఒక దేశంపై మరోక దేశం, ఒక రాష్ట్రంపై మరో రాష్ట్రలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తు శాంతిని లేకుండ చేస్తునరన్నారు. ప్రంపచ శాంతి ఉండాలని కోరుతూ శ్రమల కాలంలో కొంతమంది దీక్షలు స్వీకంరిచి ప్రతేక ప్రార్ధనలు నిర్వహించడం జరుగుతుందన్నారు. దీక్ష పరులు ఎంతో నిష్టతో శాంతితో ఉంటారన్నారు. అందుకే వారి ద్వార ప్రపంచానికి శాంతి కలగాలని గుడివాడ నుండి పెద్దఆవుటపల్లి లోని జోషఫ్ తంబి సమాధి వరకు బైక్ ర్యాలీని నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యారిస్ కమిటి అధ్యక్షులు ఏలేటి విలయంజోషి, ఇంటి స్వామిదాస్, రెబ్బా బాలరాజు, వీరబత్తిన జీవరత్నం, మహేష్, గంటా విన్సెంట్, ఉపదేశకులు దార సబాస్టిన్, అంతోని, తోట క్రీస్తురాజు, భాస్కర్, రాజు, శ్యామ్, సిస్టర్లు, మరియదళంసభ్యులు, దీక్షపరులు పాల్గొన్నారు.

సోచ్ నుంచి కొత్త స్ప్రింగ్ సమ్మర్ కలెక్షన్

విశాలాంధ్ర-విజయవాడ (వన్టౌన్): ప్రముఖ ఈవెనింగ్, అకేషన్ వేర్ బ్రాండ్, సోచ్, తమ తాజా స్ప్రింగ్ సమ్మర్ కలెక్షన్ 2024ని విడుదల చేసింది. ఈ కొత్త కలెక్షన్లో సమ్మర్ వార్డ్రోబ్ను ప్రత్యేకమైన ఎథ్నిక్ అందాలతో సమున్నతం చేస్తామని హామీ ఇచ్చే అనేక రకాల ఫ్యాబ్రిక్స్, స్టైల్స్ ఉన్నాయి. ఇండిగో హ్యూస్, షిఫ్లీ చిక్, కోటా కోచర్, ఐవరీ ఎలిగన్స్, ట్రీజీ థ్రెడ్స్, వివిడ్ బ్లూమ్స్ వంటి థీమ్ల యొక్క క్యూరేటెడ్ పాలెట్, ఈ కలెక్షన్. ఈ క్యూరేటెడ్ కలెక్షన్ కాకుండా, చీరలు, చురీదార్ సెట్లు, డ్రెస్లు, కుర్తాలు, కఫ్తాన్లు, లెహంగాలతో కూడిన ఆలోచనాత్మక శ్రేణి డిజైన్లు కూడా ఉంటాయి. రూ.1498 ప్రారంభ ధరతో, వేసవి కలెక్షన్ అన్ని సోచ్ అవుట్లెట్లలో, ఆన్లైన్లో అందుబాటులో ఉంది.

తుఫాన్ ప్రచారాన్ని ప్రారంభించిన థమ్స్ అప్

విశాలాంధ్ర-విజయవాడ (వన్టౌన్): స్వదేశీ పానీయాల బ్రాండ్ అయిన థమ్స్ అప్, ఐసీసీ టీ20 ప్రపంచ కప్కు తన తాజా ప్రచారంలో భాగంగా 'వరల్డ్ కప్ కా తూఫానీ టూర్'లో భాగంగా తూఫాన్: ది థమ్స్ అప్ బ్రాండ్ ప్రత్యేక చార్టర్డ్ విమానాన్ని ప్రారంభించింది. ఐసీసీ టీ20 ప్రపంచ కప్ అధికారిక పానీయ భాగస్వామిగా, థమ్స్ అప్ క్రికెట్ ఔత్సాహికులకు ప్రత్యేకమైన విమానంలో వెస్టిండీస్కు మరపురాని సాహసయాత్రను ప్రారంభించేందుకు ఒక అద్భుతమైన అవకాశాన్ని అందిస్తోంది. ఈ థ్రిల్లింగ్ ప్రచారంలో క్రికెట్ స్టార్లు, యువరాజ్ సింగ్, వీరేంద్ర సెహ్వాగ్ ఉన్నారు. తూఫాన్లో సీటు గెలుచుకునే అవకాశం కోసం థమ్స్ అప్ ప్యాక్ని స్కాన్ చేయమని వినియోగదారులను ప్రోత్సహించారు. వినియోగదారులు ఏప్రిల్ 30 వరకు ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకుని ఈ పోటీలో పాల్గొనవచ్చు.

వలంటీర్లను దూషించడం దుర్మార్గం

మాజీ మంత్రి వెలంపల్లి

విశాలాంధ్ర-విజయవాడ (వన్టౌన్): వలంటీర్లను దూషించడం దుర్మార్గమని మాజీ మంత్రి, సెంట్రల్ నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావుఅన్నారు. మంగళవారం విజయవాడ సింగ్నగర్ లూనా సెంటర్లో స్థానిక కార్పొరేటర్ మహమ్మద్ షాహినా సుల్తానా ఆఫీజుల్లాతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థి సుదీర్రెడ్డి వలంటీర్లను దూషించడం సబబు కాదన్నారు. ఒక వలంటీర్ ఏవిధంగా పనిచేస్తున్నారో అవ్వ తాతలకు అడిగితే చెపుతారన్నారు. మరోకమారు వలంటీర్లను దూషిస్తే సహించేదిలేదన్నారు. చంద్రబాబు 14ఏళ్లగా సీఎంగా ఉన్నప్పుడు ప్రజలకు ఏం చేశారో చెప్పాలన్నారు. చంద్రబాబు మాటలు ప్రజలు నమ్మే పరిస్థితిల్లో లేరన్నారు. మళ్ళి జగన్మోహన్రెడ్డి సీఎం అవ్వాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ప్రతి ఇంటికి వెళ్తే జగన్మోహన్రెడ్డి హాయంలో అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ప్రజలు దీవెనలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రుహూల్లా, ఫైబర్ కార్పొరేషన్ ఛైర్మన్ పూనూరి గౌతమ్ రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ గోగుల రమణారావు, డివిజన్ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీరాముని ఆరాధనతో జీవితాలు సుందరమయం

విశాలాంధ్ర- కంచికచర్ల: శ్రీరాముని ఆరాధన ద్వారా మన జీవితాలు సుందరమయం చేసుకోవాలని, ధర్మానికి, న్యాయానికి, నీతికి, మంచికి, మర్యాదకు, విలువలకు, నైతికతకు నిలువుటద్దం శ్రీరాముడు అని జీయర్ పరంపరలోని అష్టాక్షరి స్వామి తెలిపారు. కంచికచర్ల లో నూతనంగా పూర్తి రాతి కట్టడంతో నిర్మాణం పూర్తిగావించుకున్న శ్రీ సీతా రామాంజనేయ స్వామి వారి దేవస్థానములో విగ్రహ ప్రతిష్టామహోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాలలో మంగళవారం అష్టక్షరి స్వామీజీ పాల్గొని భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. రామాయణం వ్యక్తి యొక్క విధులు, హక్కులు సామాజిక బాధ్యతలను చర్చిస్తుందని, ధర్మం, ధార్మిక జీవనాన్ని వివరిస్తుందన్నారు. శ్రీ మహా విష్ణువు యొక్క ఏడో అవతారంగా రాముని అవతారమని చాలా పురాణాలు పేర్కొన్నాయి. విష్ణువు యొక్క పరిపూర్ణమైన అవతారం రాముడు అని కూడా అంటారు. హిందువులకు శ్రీరాముడు అత్యంత పూజనీయుడన్నారు. త్రేతాయుగంలోని దుష్ట శక్తులను అంతం చేయడానికే శ్రీరాముడు భూమిపై జన్మించారన్నారు. ఎంతో వ్యయప్రాసలకోర్చి, అంతటి మహిమాన్వితుడైన శ్రీరాముని ఆలయం సర్వాంగ సుందరంగా పునర్నిర్మాణం గావించుకోవడం ఈ ప్రాంత ప్రజల అదృష్టం అన్నారు. ఆలయానికి విచ్చేసిన అష్టాక్షరి స్వామికి ఆలయ పూజారులు స్వాగతం పలికారు. మంగళవారం ఆలయంలో వేదమంత్రోచ్ఛారణల మధ్య విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనము, క్షీరాదివాసం, ఆదివాసాంగ హోమం, సామూహిక లక్ష్మీ కుంకుమార్చన, అగ్నిఆరాధన, చతుర్వింశతి, కుంభారాధన, కుంభాభిమర్శన, మహాశాంతి హోమం నీరాజనం ఘనంగా జరిగాయి. ఆగమప్రవర శ్రీమాన్ బృందావనం ప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో, శ్రీమాన్ ఆగమప్రవర శ్రీ భాష్యం వెంకటరామ శేషభట్టర్ (తారంబాబు) వారి నేతృత్వమున సమర్ధులైన ఋత్విక్ వరేణ్యుల సహాయ సహకారములతో ప్రత్యేక పూజలు, హోమాలు వేదమంత్రోచ్ఛారణల మధ్య నిర్విఘ్నంగా కొనసాగుతున్నాయి. వందలాదిగా దంపతులు ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఆలయంలో ప్రతిష్టించనున్న మూలవిరాట్ విగ్రహాలకు, ధ్వజ స్తంభానికి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీ ఎత్తున అన్న సమారాధనకు చురుకుగా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. భక్తులు ధ్వజస్తంభ, స్వామివార్ల ప్రతిష్టా కార్యక్రమాలలో విరివిగా పాల్గొని, స్వామిని దర్శించి, తీర్ధ ప్రసాదములను స్వీకరించి అన్నసమారాధనలో పాల్గోని తరించగలరని ఆలయ అభివృద్ధి కమిటి విజ్ఞప్తి చేసింది.

2024 ఎన్నికల్లో గెలుపే లక్ష్యం : టీడీపీ

విశాలాంధ్ర- కంచికచర్ల: 2024 ఎన్నిక లే గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మండల టిడిపి పార్టీ అధ్యక్షులు కోగంటి బాబు పేర్కొన్నారు. కంచికచర్ల టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కోగంటి బాబు ఆధ్వర్యంలో కంచికచర్ల పట్టణంలో గల స్థానిక వసంత కాలనీ నందు శంకరామ కార్యక్రమాన్నిటిడిపి నాయకులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి జాతీయ నాయకు లు నారా చంద్రబాబు నాయుడు పేద ప్రజల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టిన సూపర్ 6 ప్యాక్ మేనిఫెస్టోను వివరిస్తూ కరపత్రాలను ప్రజలకు నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా 2024 ఎన్నికల్లో టిడిపి జనసేన బిజెపి బలపరిచిన నందిగామ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థిని తంగిరాల సౌమ్యతో పాటు విజయవాడ పార్లమెంట్ టిడిపి జనసేన బిజెపి బలపరిచిన ఉమ్మడి అభ్యర్థి కేసినేని శివనాద్ (చిన్ని) వీరి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయా లని కోగంటి కార్యకర్తల కునాయకులు సూచించారు.అత్యధిక భారీ మెజారిటీతో గెలిపించాలని టిడిపి నాయకులు ప్రజలకు వివరించారుపట్టణ నందిగామ నియోజక వర్గ టిడిపి జనసేన బిజెపి బలపరిచిన అభ్యర్థిని తంగిరాల సౌమ్య ను అత్యధిక మెజార్టీ తో గెలిపించాలని ప్రజలనుకోరారు. అనంతరం తంగిరాల సౌమ్య కేసినేని శివనాధులు, అత్యధిక మెజారిటీతో గేలవాలని స్థానిక నాగలక్ష్మి అమ్మవారి గుడి నందు ప్రత్యేక పూజలు గావించారు. ఈ కార్యక్రమంలో కోగంటి బాబు,గుర్రం రామకృష్ణ, తాడపనేని లక్ష్మణరావు,వేమా వెంకట్రావు, గుత్త ఓంకార్, గూడవల్లి గణేష్,జనసేన నాయకులు తోట ఓంకార్,రొంపిచర్ల శ్యాము, షేక్ రఫీ నాగుల్ మీరా ,మస్తాన్ ఇమ్రాన్,బాజీ,తోట మల్లి, కేబుల్ ప్రసాద్, నాగవరపు స్వామి, తాళ్లూరి జాలయ్య, రంగశెట్టి నరసింహారావు,మేడి అక్కరావు,నన్నపనేని వెంకటరామయ్య కోపూరు పని, నందిగామ నియోజకవర్గ ఐటీడీపీ నాయకులు ప్రతీప్ తదితర టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

సకల జన సంక్షేమమే జగనన్న లక్ష్యం

- వైసీపీ పశ్చిన నియోజకవర్గ అభ్యర్థి షేక్ ఆసిఫ్
- గొల్లపూడి మహాత్మా గాంధీ హెూల్ సేల్ కమర్షియల్ మార్కెట వద్ద విస్తృత ప్రచారం...
- అసోసియేషన్ నాయకులతో భేటీ

విశాలాంధ్ర-విజయవాడ (వన్టౌన్): రాష్ట్రంలోని పేదలు, వ్యాపారులు, కార్మికులు, రైతులు, ఉద్యోగులు... ఇలా సకలజనుల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లక్ష్యమని వైసీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి షేక్ ఆసిఫ్ చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సమాన ప్రాధాన్యత ఇస్తూ ఐదేళ్లు పాలన సాగించారని తెలిపారు. తన సంక్షేమ పాలనలో ప్రతి కుటుంబానికి మేలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కు రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి ఆసిఫ్ మంగళవారం గొల్లపూడి మహాత్మాగాంధీ హెూల్ సే కమర్షియల్ మార్కెట్ వద్ద ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి వ్యాపారి, ముఠా కార్మికులను కలిసి సమస్యలు తెలుసుకుని, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా అసోసియేషన్ అధ్యక్షుడు పరుచూరి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బచ్చు రమేష్, కార్యదర్శి కాసుల వెంకట నారాయణ, కోశాధికారి నంబూరు సాంబశివరావు, సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వ్యాపారులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆసిఫ్ చెప్పారు. ఏ కష్టం వచ్చినా కంటికి రెప్పలా కాపాడుకుంటామని, గత ఎన్నికల్లో వెలంపల్లి శ్రీనివాసరావు ను ఇచ్చిన విధంగానే తనకు సంపూర్ణ మద్దతు ఇచ్చి గెలిపించాలని కోరారు. అసోసియేషన్ నాయకులు కూడా గతంలో వెలంపల్లిని గెలిపించిన విధంగానే స్థానికుడైన ఆసిఫ్ కు అండగా ఉంటామని తెలిపారు. అనంతరం ఆసిఫ్ మీడియాతో మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పెద్ద ఎత్తున అభివృద్ధి చేశామని, ఏ గడపకు వెళ్లినా ప్రజలు సంతోషంగా స్వాగతం పలికి ఆదరిస్తున్నారని, ఇది జగనన్న అందించి సంక్షేమ పాలనకు నిదర్శనమని చెప్పారు. నిత్యం అందుబాటులో ఉండే తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ జనబలం కలిగిన ఒక్క జగనన్నను ఎదుర్కొనేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి ఎన్నికలకు రావడం సిగ్గుచేటు అన్నారు. కూటమి పేరుతో వచ్చే పెత్తందారులకు ప్రజలు తగిన బుద్ధి చెప్పి నిరంతరం అందుబాటులో ఉండే స్థానికుడు, సామాన్యుడు అయిన అసిఫ్ ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మరుపిళ్ల రాజేష్, నరేంద్ర, చలపతిరావు, జైన్ కార్పోరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, విశ్వబ్రాహ్మణ కార్పోరేషన్ మాజీ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.